



# కెరటం న్యూస్







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 252 | శనివారం 13- సెప్టెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## రాసిపెట్టుకోండి.. మళ్లీ గెలిచేది ఎన్డీఏనే..



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): దేశంలో, రాష్ట్రంలో 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమే అధికారంలోకి వస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కావాలంటే రాసిపెట్టుకోండని, 2029లో నరేంద్ర మోడీ నాలుగోసారి పీఎం అవు తారని స్పష్టం చేశారు.

## దేశమంతటా
# బాణాసంచా నిషేదించాలి
### సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): ఢిల్లీలోని ఎన్‌సీఆర్ ప్రాంతంలో బాణాసంచా నిషేదంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా తయారీ దారులు, వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా నిషేదం కేవలం ఢిల్లీలోని ఎన్‌సీఆర్‌కు మాత్రమే ఎందుకు వర్తిస్తుందని ప్రశ్నించింది. భారతదేశం అంతటా పౌరులు స్వచ్ఛమైన గాలిని పొందే హక్కును కలిగి ఉన్నారని పేర్కొంది. పండుగ సీజన్‌కు ముందు దీనిపై విచారణ జరగాల్సి ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.



# రాహుల్ గాంధీ.. ఈ చోరీ సంగతేంటి మరి?
## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కేటీఆర్ ఫైర్

న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి "ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా?" అని ఎద్దేవా చేశారు.

బిఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు "మేము కాంగ్రెస్‌లో చేరలేదు" అని అంటున్నారు.. ఇది ఎంత వరకు కరెక్ట్ అని కేటీఆర్ ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటున్నారు, మీరు దీన్ని ఒప్పుకుంటారా అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.





# బాసర టు భద్రాచలం
# టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్

- గోదావరి పుష్కరాల కోసం శాశ్వత ఘాట్స్ ప్రణాళిక – ప్రధాన ఆలయాల వద్ద విస్తరణకు చర్యలు
- ఒకేసారి 2 లక్షల మంది స్నానాలకు సౌకర్యాలు కల్పించాలి
- ప్రతి ఆలయానికి స్థానిక పరిస్థితులకు తగ్గట్టు ప్రత్యేక డిజైన్ ఘాట్లు
- పుష్కరాల కోసం రోడ్లు, సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- పర్యాటక, నీటిపారుదల, దేవాదాయశాఖల సమన్వయంతో ఘాట్ పనులు చేపట్టాలని సీఎం ఆదేశం

న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు. ఇవాళ కమాండ్ కంట్రోల్ సెంటర్?లో 2026లో వచ్చే గోదావరి పుష్కరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు ఇతర ఆలయాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరీవాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## మేం ఎవరిపైనా పెత్తనం చెలాయించట్లే..
# మాకు అందరికి బాస్ అతనే
### హైడ్రా కమిషనర్ రంగనాథ్



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): యాకుత్ పురలో ఐదేళ్ల బాలిక మ్యాన్ హోల్ లో పడిన ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం ఉదయం యాకుత్ పురలో ఐదేళ్ల బాలిక మ్యాన్ హోల్?లో పడింది.. వెంటనే వాళ్ల నాన్నమ్మ బయటికి తీసిందని తెలిపారు. హైడ్రా వల్లే తప్పు జరిగినట్లు గుర్తించామన్నారు రంగనాథ్. ఈ ఘటనకు బాధ్యులైన హైడ్రా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాలిక మ్యాన్ హోల్‌లో పడిన చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హోల్స్ ఉన్నాయని.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్ళు క్లీన్ చేశారని చెప్పారు.

## నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): నేపాల్‌లో కొత్త శకం మొదలైంది. హిమాలయ దేశానికి తొలి మహిళా ప్రధానిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కీ ప్రమాణస్వీకారం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా జెన్–జెడ్ నిరసనకారులు చేసిన ఆందోళనలతో కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జెన్–జెడ్ ప్రతినిధులు, ఆర్మీ, అధ్యక్షుడితో జరిపిన చర్చల్లో సుశీల కర్కీని ప్రధానిగా ఎన్నుకున్నారు.

# త్వరలోనే జాబ్ క్యాలెండర్
## పరీక్షల సన్నద్ధతలో ఉండండి..
### : నిరుద్యోగులకు మంత్రి పొన్నం కీలక సూచన



- నిరుద్యోగులకు భరోసా ఇచ్చిన మంత్రి పొన్నం – 65 వేల ఉద్యోగాలు ఇప్పటికే ఇచ్చామని స్పష్టం
- గ్రూప్ 1 పరీక్షలపై కోర్టు తీర్పును స్వాగతించాలి – ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించిన పొన్నం
- న్యాయపరమైన చిక్కులు అధిగమించి నియామకాలు పూర్తి చేస్తాం – మంత్రి పొన్నం హామీ

## సింగరేణి
### బతికించుకోవాలంటే గనులు పెంచుకోవాలి : భట్టి విక్రమార్క



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు.

# ఫిరాయింపులపై కేటీఆర్ వ్యాఖ్యలు దారుణం

- "సిగ్గు మీకే వర్తిస్తుంది" - కేటీఆర్ కు జూపల్లి కౌంటర్
- కవిత ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదు?
- తెలంగాణను అప్పుల కుప్పగా మార్చింది బీఆర్ఎస్



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సిగ్గుందా? అనే వ్యాఖ్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా మండపడ్డారు. ఎమ్మెల్యేలను సిగ్గుందా అని కేటీఆర్ అనడం దారుణమన్నారు. తెలంగాణ కోసం వందలాది మంది యువకులు ప్రాణత్యాగం చేసినా, మీరు సిగ్గులేని పనులు ఎన్నో చేశారని ఆరోపించారు. చెప్పులు మోసే సంతోష్ రావుకు ఎంపీ పదవి ఇచ్చినప్పుడు మీకు సిగ్గురాలేదా?.. వేల కోట్లు అక్రమార్జన చేశారని కవితే చెప్పింది కదా.. ఆమె ఏం లేకుండా మాట్లాడిందా? అని ప్రశ్నించారు. కవిత, కేటీఆర్ ఇద్దరూ ఒకటే.. సిగ్గుశరం అనే పదం వారందరికీ వర్తించాలని మంత్రి జూపల్లి అన్నారు.

అలాగే, ఈ ప్రభుత్వం ఇవాళో, రేపో కూలిపోతుందని కేటీఆర్ అన్నారు?.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని ఆలోచన ఆయనది.. 88 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను మీరే తీసుకున్నది నిజం కాదా?.. ఎమ్మెల్యేలు పనుల కోసం మాత్రమే వెళ్లారు, పార్టీలో చేరితే పనులు అవుతాయని చెప్పింది కేటీఆర్ అని మంత్రి తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఏదైనా స్పీకర్, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే చర్యలు తీసుకుంటారు..

## మీడియాపై కేసులు పెడుతారా..?
# జర్నలిస్టులను భయపెడుతారా..?

- రైతుల యూరియా కష్టాలను చూపిస్తే కేసులా..? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్‌రావు
- జర్నలిస్టుపై పోలీసు కేసు దుర్మార్గం
- సాంబశివరావుపై పెట్టిన కేసులు ఉపసంహరించాలి

– హరీశ్‌రావు డిమాండ్

న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): రైతుల యూరియా కష్టాలను చూపిస్తే మీడియాపై కేసులు పెడతారా..? అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెడుతారా..? అని కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన టీ న్యూస్ ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అని మండిపడ్డారు.



## ఆందోళనకరంగా ప్రజాప్రతినిధుల భాష



న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్): ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాప్రతినిధుల భాషా ఆందోళనకరంగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బెంగళూరులో నిర్వహించిన 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్, ఇండియా రీజియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభలు నిజమైన చర్చా దేవాలయాలుగా మారినప్పుడు ప్రజాస్వామ్యం వృద్ధి చెందుతుందని, శాసనసభ్యులుగా ఒకరినొకరని గౌరవించుకోవాలన్నారు.

## మేం ఎవరిపైనా పెత్తనం చెలాయించట్లే.. మాకు అందరికి బాస్ అతనే: హైడ్రా కమిషనర్ రంగనాథ్

అయితే.. బాలిక పడిన మ్యాన్ హోల్ మాత్రం హైడ్రా సిబ్బందే క్లీన్ చేశారని.. హైడ్రా వల్లే తప్పు జరిగిందని అంగీకరించారు రంగనాథ్. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా ఒప్పుకుంటున్నామని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదని తెలిపారు రంగనాథ్. జీహెచ్ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్ అని.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదని చెప్పారు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారని స్పష్టం చేశారు. ఈ ఘటనపై రాజకీయ పరంగా చేసే కామెంట్స్ పై మేం స్పందించమని చెప్పారు.

ఫ్యూచర్‌లో మళ్ళీ ఇలాంటి తప్పు రిపీట్ కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కి డీఆర్ఎఫ్ టీమ్ ఇంచార్జ్‌గా ఉన్నారని.. ఆయనపై చర్యలు ఉంటాయని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్ హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నామని.. మూతలు సరిగా లేనివి గుర్తించి సంబంధిత ఏజెన్సీకి సెక్రెటరీ ద్వారా రిఫర్ చేస్తామని చెప్పారు.

హైడ్రాకు శాంక్షన్ అయిన బడ్జెట్‌లో ఒక క్వార్టర్ ది మాత్రమే రిలీజ్ అయిందని తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ లేదని వెల్లడించారు. బతుకమ్మ కుంట పనులు పూర్తవబోతున్నాయని.. త్వరలోనే సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి బతుకమ్మ పండగ అక్కడ జరిగేలా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

## బాసర టు భద్రాచలం టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ : సీఎం రేవంత్ రెడ్డి

ప్రస్తుతం ఉన్న ఘాట్స్‌ను విస్తరించడంతో పాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పుష్కరాల సమయంలో దాదాపు రెండు లక్షల మంది ఒకే సారి స్నానాలు ఆచరించేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఆలయానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు డిజైన్లలో ఘాట్లు నిర్మించాలని అన్నారు. ఇందు కోసం పర్యాటక శాఖతో పాటు నీటిపారుదల, దేవాదాయశాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మూడు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాసిపెట్టుకోండి.. మళ్లీ గెలిచేది ఎన్డీఏనే..



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** దేశంలో, రాష్ట్రంలో 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమే అధికారంలోకి వస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కావాలంటే రాసిపెట్టుకోండని, 2029లో నరేంద్ర మోడీ నాలుగోసారి పీఎం అవు తారని స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన ఓ మీడియా కాంక్లేవ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆలస్యంగా సాధించే విజన్ 2020, 2047 వల్ల రాజకీయంగా నష్టమేమీ ఉండదన్నారు. 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి నంబర్?వన ఎకానమీగా అవతరించాలని ఆకాంక్షించారు. అందులో తెలుగు వారి పాత్ర ప్రముఖంగా ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి, రాజకీయ ప్రయోజనాలు.. ఇలా రెండింటి కోసం కష్టపడాల్సిన అవసరముందని తెలిపారు. అందుకే సూపర్-6 అమలు చేశామని, అభివృద్ధి కోసం మూలధన పెట్టుబడులు పెంచామని పేర్కొన్నారు. వృద్ధి రేటును 17శాతానికి పెంచేలా కృషి చేస్తున్నానని వెల్లడించారు. రాజకీయ ప్రయో జనాల గురించి ఆలోచిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదని చంద్రబాబు తెలిపారు.

అమరావతిలో రూ.50 వేల కోట్ల పనులు రాబోయే మూడేళ్లలో అమరావతిలో రూ.50 వేల కోట్ల పనులు పూర్తవుతాయని సీఎం చంద్రబాబు చెప్పారు. అమరావతిని నాలెడ్జ్ ఎకానమీగా, క్వాంటం సిటీగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పోలవరం రాష్ట్రానికి ఎంతో కీలకమని, మూడేళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 740 కిలోమీటర్ల దూరం కృష్ణమ్మను తరలించి రాయలసీమకు, కుప్పానికి నీరు అందించామని వివరించారు. కష్టాల్లోనూ ఈ ఏడాది రాష్ట్రం డబుల్ డిజిట్ గ్రోత్ సాధించిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరముందని తెలిపారు. అభివృద్ధి కోసమే పీపీపీ మోడల్స్ అనుసరిస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఇవే అమలవుతున్నాయని తెలిపారు. దీని ద్వారా సంపద సృష్టి జరిగి, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఆ ఆదాయంతో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసే శక్తి వస్తుందన్నారు. అందుకే గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేవాళ్లం. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నామని చంద్రబాబు తెలిపారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలు

మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపైనా సీఎం చంద్రబాబు స్పందించారు. 'జగన్ ఐదేళ్లలో కాలేజీలు కట్టకపోయినా కట్టానని ప్రచారం చేసుకున్నారు. మేము పీపీపీ విధానం తెచ్చినా.. కాలేజీలు గవర్నమెంట్ ఆధ్వర్యంలోనే నడుస్తాయి. ఓపీ ఫ్రీగా ఉంటుంది. రెండు, మూడేళ్లలో 17 మెడికల్ కాలేజీలు ఆపరేట్ అవుతాయి' అని సీఎం తెలిపారు. భవిష్యత్తు కోసమే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టామన్నారు. 'నీళ్లు ఉంటేనే సుస్థిర అభివృద్ధి సాధ్యం అవుతుంది. రాయ లసీమకు నీళ్లు ఇస్తే దేశంలోనే నంబర్ వన్ గా మారుతుంది. గోదావరిలో పైన ఉండే నీటిని తెలంగాణ వాడుకోవచ్చు. మేం సముద్రంలోకి వెళ్తున్న నీటినే వాడుకుంటాం. అందుకే బనకచర్ల కట్టాలని ప్రతిపాదించాం' అని చంద్రబా బు స్పష్టం చేశారు

## మీడియాపై కేసులు పెడుతారా..? జర్నలిస్టులను భయపెడుతారా..? : హరీశ్‌రావు



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రైతుల యూరియా కష్టాలను చూపిస్తే మీడియాపై కేసులు పెడతారా..? అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెడుతారా..? అని కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన టీ న్యూస్ ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అని మండిపడ్డారు.

రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టుపై పోలీసులు ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. గడిచిన 2 నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం శోచనీయం. శాంతిభద్రతల నిర్వహణను పక్కన పెట్టి ప్రజల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడడం అప్రజాస్వామీకం. జర్నలిస్ట్ సాంబశివరావుపై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## త్వరలోనే జాబ్ క్యాలెండర్ పరీక్షల సన్నద్ధతలో ఉండండి..

**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** నిరుద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచన చేశారు. నిరుద్యోగులు ఆందోళన చెందొద్దని.. త్వరలోనే జాబ్ క్యాలెండర్ వస్తుందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాల ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేస్తామని.. నిరుద్యోగులంతా పరీక్షల సన్నద్ధతలో ఉండాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును సందర్శించిన మంత్రి పొన్నం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ పోరాటానికి మూలమైన నీళ్లు, నిధులు, నియామకాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమై పెండింగ్?లో ఉన్నప్పటికీ వాటినన్నింటిని పరిష్కరించి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 65 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ విషయంలో కొన్ని లోపాలున్నాయనే కారణంతో కోర్టు ఒక తీర్పు ఇచ్చిందని.. కోర్టు నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలన్నారు.

కానీ కోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ మొత్తం పరీక్షనే రద్దు చేయాలని కోరుతూ రాక్షసానందం పొందుతున్నారని.. ఇది దురదృష్టకరమన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలబడి, వారికి అండగా ఉండి బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తే మంచిదని సూచించారు. ఎక్కడైనా న్యాయపరమైన చిక్కులు ఉంటే వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు.

## ఫిరాయింపులపై కేటీఆర్ వ్యాఖ్యలు దారుణం

నేను ఏడు సార్లు పోటీ చేశాను, కానీ ఏ వేదికపైనా హామీలు ఇవ్వలేదు.. అయినా పనులు చేశాను.. దాన్ని పక్కనబెట్టి, కేటీఆర్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని జూపల్లి మండిపడ్డారు.

ఇక, తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినందుకు కేటీఆర్ సిగ్గుపడాలని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పుకొచ్చారు. ఫిరాయింపులపై నీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా? వాస్తవాలకు, బూతులకు తేడా తెలియని వ్యక్తి నువ్వు అని కేటీఆర్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తాను కూడా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరానని, రాష్ట్రం వెనక్కి పోకుండా నిలబడాలని అప్పట్లో ఆ నిర్ణయం తీసుకున్నానని, తిరిగి కాంగ్రెస్‌లో చేరడం తప్పు కాదన్నారు. ప్రతి విషయానికి ఒక సమయం, సందర్భం అనేది ఉంటుంది అని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలియజేశారు.

## నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** నేపాల్‌లో కొత్త శకం మొదలైంది. హిమాలయ దేశానికి తొలి మహిళా ప్రధానిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి ప్రమాణస్వీకారం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా జెన్-జెడ్ నిరసనకారులు చేసిన ఆందోళనలతో కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జెన్-జెడ్ ప్రతినిధులు, ఆర్మీ, అధ్యక్షుడితో జరిపిన చర్చల్లో సుశీల కర్కిని ప్రధానిగా ఎన్నుకున్నారు. ఆమె చేత అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణం చేసిన వెంటనే, కర్కి తన ప్రభుత్వ మొదటి క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 4, 2026న కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుని, అత్యవసర పరిస్థితి విధించాలని సిఫారసు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేబినెట్ సిఫారసు తర్వాత, అధ్యక్షుడి ఆమోదం పొందితే, దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ అమలులోకి వస్తుంది.

అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొంది. సోమవారం ప్రారంభమైన నిరసనల్లో, భద్రతా బలగాల కాల్పుల్లో 19 మంది మరణించడంతో, హింసాత్మక పరిస్థితులు ఏర్పడ్డాయి. నిరసనకారులు ప్రధాని కేపీ శర్మ ఓలి ఇళ్లు, పార్లమెంట్, ఇతర ప్రభుత్వ భవనాలకు నిప్పు పెట్టారు. నిరసనలు పెద్దవి అవుతుండటంతో ఓలి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నిరసనల్లో మొత్తం 51 మంది మరణించారు.

## సింగరేణి బతికించుకోవాలంటే గనులు పెంచుకోవాలి: భట్టి విక్రమార్క



ఈ మేరకు ఆయన శు క్రవారం మీడియాతో మాట్లాడారు. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు.

సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

## పార్టీ మారకపోతే కేసీఆర్ వద్దకు రావాలి.. కానీ, రేవంత్ రెడ్డి దగ్గరకి ఎందుకెళ్లారు..?



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. మీరు పార్టీ మారకపోతే, పార్టీ నాయకత్వంపై విశ్వాసం ఉంటే అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరకు రావాలి.. లేదంటే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు అయినా రావాలి.. కానీ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు రాగానే సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి ఎందుకు వెళ్ళినారు అని జగదీష్ రెడ్డి ప్రశ్నించారు.

ఇక, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలు స్పీకర్ పై ఒత్తిడి పెట్టి సాంకేతికంగా తప్పించుకోవాలని ప్రయత్నించినా.. ప్రజల నుంచి మాత్రం తప్పించుకోలేరు అని ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అలాగే, ప్రజా క్షేత్రంలో మీకు శిక్ష తప్పదు అని విమర్శించారు. ప్రజల దృష్టిలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ద్రోహులుగా మిగిలిపోతారని చెప్పుకొచ్చారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ సరైన నిర్ణయం తీసుకుంటే మంచిది.. లేదంటే, కోర్టు ద్వారా న్యాయం జరుగుతుంది అని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ.. ఈ చోరీ సంగతేంటి మరి?: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి "ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా?" అని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు "మేము కాంగ్రెస్‌లో చేరలేదు" అని అంటున్నారు.. ఇది ఎంత వరకు కరెక్ట్ అని కేటీఆర్ ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటున్నారు, మీరు దీన్ని ఒప్పుకుంటారా అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. "ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?" అంటూ రాహుల్ గాంధీని నిలదీశారు. ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకంటే, ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని వ్యాఖ్యానించారు. ఈ ద్వంద ప్రమాణాలపై రాహుల్ గాంధీకి సిగ్గు లేదని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

## దేశమంతటా బాణాసంచా నిషేదించాలి.. సుప్రీం కీలక వ్యాఖ్యలు



బాణాసంచా కాలుష్యం గాలి నాణ్యతను మరింత దిగజార్చుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీ ఎన్సీఆర్‌కు చెందిన ఉన్నత పౌరులకు స్వచ్ఛమైన గాలిని పొందే హక్కు ఉంటే ఇతర నగరాల ప్రజలకు ఆ హక్కు ఎందుకు ఉండకూడదని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. బాణాసంచా నిషేదం దేశమంతటా అమలులో ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. గత శీతాకాలంలో తాను అమృత్‌సర్‌లో ఉన్నానని అక్కడ కాలుష్యం ఢిల్లీ కంటే దారుణంగా ఉందని తెలిపారు.


ఆయన వాదనకు మద్దతిస్తూ సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్... ఉన్నత వర్గాలు తమను తాము జాగ్రత్తగా చూసుకుంటాయని తెలిపారు. కాలుష్యం ఉన్నప్పుడు వాళ్లంతా ఢిల్లీని విడిచి ఇతర ప్రాంతాలకు వెళతారని తెలిపారు. ఇదిలా ఉంటే ఢిల్లీలోని ఎన్సీఆర్ ప్రాంతంలో బాణాసంచా కాల్చడంపై, అమ్మకాలపై కఠిన ఆంక్షలు ఉంటాయి. ఇక దేశవ్యాప్తంగా నిషేదిస్తే అలాంటి ఆంక్షలే దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉంది. త్వరలో దసరా, దీపావళి పండుగలు ఉండగా సుప్రీం బాణాసంచాపై చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

## ఆందోళనకరంగా ప్రజాప్రతినిధుల భాష



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాప్రతినిధుల భాషా ఆందోళనకరంగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బెంగళూరులో నిర్వహించిన 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్, ఇండియా రీజియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభలు నిజమైన చర్చా దేవాలయాలుగా మారినప్పుడు ప్రజాస్వామ్యం వృద్ధి చెందుతుందని, శాసనసభ్యులుగా ఒకరినొకరని గౌరవించుకోవాలన్నారు. విభిన్న అభిప్రాయాలను గౌరవిస్తే, ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తే, ప్రజల విశ్వాసాన్ని పెంచుకోవడమే కాకుండా వారి ఆకాంక్షలను కూడా నెరవేర్చగలమని తెలిపారు. ప్రజాస్వామ్యానికి కేంద్రబిందువు శాసన సభ, శాసన మండలి సభలని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు తమ కోసం మాట్లాడతారని, తమ ప్రయోజనాలను కాపాడుతారని, రాజ్యాంగ విలువలను నిలబెడుతారని నమ్ముతారని అన్నారు.అయితే.. ఇటీవలి కాలంలో అంతరాయాలు, అర్థవంతమైన చర్చ లేకపోవడం, శాసనసభ కార్యకలాపాలలో గౌరవం లేకపోవడంతో పౌరులలో కాస్త ఆందోళన పెరుగుతున్నదని చెప్పారు. సభలో చర్చలు ఉత్సాహంగా ఉండాలని.. ఎప్పుడూ అగౌరవంగా ఉండకూడదని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఉన్న రెండు శాసనసభలు ప్రజల అభ్యున్నతి కోసం, సరియైన చట్టాలను రూపొందించడం కోసం పనిచేస్తున్నాయని, శాసన మండలి చైర్మన్‌గా సభలో సభ్యులందరి హక్కులను కాపాడుతున్నానని గౌరవంగా తెలుపుతున్నానని ఆయన తెలిపారు. ఇటీవల సంక్షేమ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యా సంస్కరణలపై, బీసీ వర్గాల రిజర్వేషన్లపై అర్థవంతమైన చర్చలు శాసన సభలలో జరిగాయని ఆయన తెలిపారు. ఈ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేటివ్ సెక్రెటరీ డా.వి.నరసింహాచార్యులు, చైర్మన్ ఓఎస్డీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ చేయనివ్వం: చంద్రబాబుకు ఎమ్మెల్సీ బొత్స హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం రాష్ట్రంలో మరోసారి సంచలనంగా మారింది. గతంలోనే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం అడుగులు వేసింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తంకావడంతో ప్రైవేటీకరణ నుంచి వెనక్కి తగ్గింది. కానీ ప్లాంట్ నష్టాల్లో ఉందని, ఆర్థిక సాయం చేసింది. ఆ తర్వాత ప్లాంట్ ఉద్యమం అడుగున పడింది.

కానీ ఇటీవల కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాబోతోందనే ప్రచారం ఊపందుకుంది. దీంతో అధికార పార్టీ ఖండించింది. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గళం విప్పింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని ప్రకటించింది. విశాఖలో ఆందోళనలు నిర్వహించింది. స్టీల్ ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయనివ్వమని ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. తాజాగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా ఆదే మాట చెప్పారు. విశాఖ ఉక్కు పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనివ్వమన్నారు. ప్రజా ఉద్యమంగా మారితేనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగుతుందని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయడం చంద్రబాబు నైజమని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

కెరటం న్యూస్



## భగత్ సింగ్ ఆశయాల సాధనకు సమిష్టిగా కృషిచేద్దాం

**సిక్కు కుటుంబాలకు అండగా ఉంటా**

**సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సిక్కు కుటుంబాలు రాణించాలి**

**ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్జెన్**



**కొత్తగూడెం, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** దేశ స్వాతంత్యం కోసం ప్రాణాలకు తెగించి పోరాడి చిరుప్రాయంలోనే ప్రాణత్యాగం చేసిన సర్ధార్ భగత్ సింగ్ ఆశయాల సాధనకు సమిష్టిగా కృషిచేద్దామని ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్ గిల్జెన్ అన్నారు. కొత్తగూడెం పర్యటన సందర్భంగా శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో పట్టణంలోని సిక్కు కుటుంబాలతో సమావేశమయ్యారు. భగత్ సింగ్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సిక్కు కుటుంబాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సిక్కు జాతికి భారత దేశమంటే ప్రాణమని, దేశంకోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయని పోరాట పటిమ ఉన్నవారన్నారు. పంజాబ్ రాష్ట్రము నుంచి ఉపాధి కోసం భద్రాద్రి జిల్లాకు, కొత్తగూడెం పట్టణానికి వలస వచ్చిన సిక్కు కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిస్కారం కోసం ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో స్థిరపడిన సిక్కు కుటుంబాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ.. సిక్కు కుటుంబాలకు అనాదిగా సిపిఐ అండగా ఉంటుందని, వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్ గిల్జెన్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఓసి సభ్యులు నల్లా సురేష్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, సందీపట్ల శ్రీనివాసరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, నాయకులు భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయకుమార్, సత్యనారాయణాచారి, నేరెళ్ల శ్రీనివాస్, దుర్గ, ఫెడరేషన్ నాయకులు పున్నం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## టీ న్యూస్ ప్రతినిధి పై కేసును ఖండించిన వద్దిరాజు



**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా టీ న్యూస్ బ్యూరో రిపోర్టర్ సాంబశివరావు పై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఖండించారు. జిల్లాలో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. యూరియా అందించలేని సర్కారు రైతులు, రైతు సంఘాల నాయకులు, జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ నిర్బంధాలు ప్రయోగించడంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలా ప్రశ్నించే వారిని కేసులు నిర్బంధాల పేరుతో భయపెట్టాలనుకోవడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. సాంబశివరావు పై పెట్టిన కేసును తక్షణం ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అమెరికాలోని మున్నూరు కాపు బిడ్డల ఆదరణ మరువలేను: ఎంపి వద్దిరాజు

**మున్నూరు కాపుల ఘన సన్మానం**



**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** అమెరికాలోని మున్నూరుకాపు బిడ్డల ప్రేమ, ఆదరణ మరువలేనని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇటీవల అమెరికా పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని తొలిసారిగా ఖమ్మం విచ్చేసిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఖమ్మం నగర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించుకున్నారు. స్థానిక బురహాన్ పురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మున్నూరుకాపు ప్రముఖులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు రాజకీయ పార్టీలకు చెందిన మున్నూరుకాపు నాయకుల సమక్షంలో ఎంపీ రవిచంద్రను భారీ గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ..ఇటీవల తన అమెరికా పర్యటనలో అక్కడి మున్నూరుకాపు బిడ్డలు చూపిన ఆదరణ, ఆప్యాయత ఎన్నటికీ మరువలేనని అన్నారు. కొద్ది రోజుల తన పర్యటనలో అందర్నీ కలవలేకపోయినందుకు బాధపడుతున్నానని అన్నారు. అమెరికాలో స్థిరపడ్డ మున్నూరు కాపులంతా అక్కడ కమ్యూనిటీ అవసరాల కోసం భవనాలు నిర్మించాలని తాను చేసిన సూచనకు గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ తోపాటు అక్కడి కుల బంధువులు అందరూ ఆమోదించారని గుర్తు చేశారు. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా మున్నూరు కాపులంతా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన మున్నూరు కాపులు ఇతరులను గౌరవించడంలో ఎప్పుడు ముందుంటారని అన్నారు. బిసీ కులాల్లోని ఇతర సామాజిక వర్గాలను కలుపుకొని పోతూ మున్నూరు కాపు కులాన్ని కూడా బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు ప్రముఖులు మేకల భిక్షమయ్య, పారా నాగేశ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, కనకం జనార్ధన్, కార్పొరేటర్లు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం, మాటేటి రామారావు, కాంగ్రెస్ నాయకులు పసుపులేటి వెంకట్ ,సిపిఐ నాయకులు మేకల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు మేకల నాగేందర్, బీఆర్ఎస్ నాయకులు పిన్ని కోటేశ్వరరావు, యాసా రామారావు, గుళ్లపల్లి శేషగిరిరావు, ఎర్రా అప్పారావు, యూత్ నాయకులు తోట రమేష్, వివిధ నియోజకవర్గాల బాధ్యులు, మాధురి మధు, మారిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ మున్సిపల్ ఫోరం ఏకగ్రీవం





**ఖమ్మం టౌన్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ మున్సిపల్ ఫోరం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, కల్లూరు, ఏదులాపురం, మరియు ఖమ్మం నగర పాలక సంస్థ లలో వివిధ స్థానాలలో పనిచేస్తున్న సభ్యులు పాల్గొన్నారు. సింగిల్ సెట్ నామినేషన్ రావటంతో ఏకగ్రీవంగా మున్సిపల్ ఫోరం ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీఎన్జీవోస్ జాయింట్ సెక్రెటరీ తాళ్లూరి శ్రీకాంత్ ప్రకటించారు. ఎన్నిక అనంతరం జరిగిన కార్యక్రమానికి టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మున్సిపల్ ఫోరం ఎన్నికలు ఏకగ్రీవంగా జరగటం సంతోషంగా ఉందని, అందరూ ఐక్యంగా ఉంటూ సభ్యుల సమస్యల పట్ల స్పందిస్తూ, వారికి చేదోడు వాదోడుగా ఉండాలని, ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ ఎల్లప్పుడు మీకు అండగా ఉంటారని చెప్పారు. టీఎన్జీవోస్ కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ, మున్సిపల్ ఉద్యోగులకు అనేక రకాల ఒత్తిడిలు, సమస్యలు వస్తుంటాయని, ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, మున్సిపల్ ఉద్యోగులకు కూడా నూతన ఫోరం అండగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కొమరగిరి దుర్గాప్రసాద్, టీఎన్జీవోస్ సెంట్రల్ కార్యదర్శి జెడ్. ఎస్. జైపాల్, టిఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్లు యర్రా రమేష్, లలిత కుమారి, టిఎన్జీవోస్ నగర శాఖ అధ్యక్షులు ప్రభాకర చారి,రుక్మారావు, టీఎన్జీవోస్ నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు. నూతన మునిసిపల్ ఫోరం బాధ్యులుగా ఈ క్రింది వారు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అధ్యక్షులుగా ఏ.సుధాకర్, అసోసియేటెడ్ అధ్యక్షులుగా ఈ.ఉదయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు గా ఎం.శ్రీనివాస్, కె.లింగయ్య, జె. నాగరాజు,జె.సూచిత, సెక్రెటరీగా జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.సాంబయ్య, సిహెచ్. శ్రీనివాస్, జె.రాంబాయి, ఏ.ప్రేమ్ కుమార్ రెడ్డి, ట్రెజరర్ గా బి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా బి.సుధాకర్, పబ్లిసిటీ సెక్రెటరీ గా కె.శ్రీకాంత్, స్పోర్ట్స్ సెక్రటరీ గా అవినాష్, ఆఫీస్ సెక్రటరీ గా కే.హేమనాథ్ సాయి, కార్యవర్గ సభ్యులుగా ఎం.ప్రవీణ్ కుమార్, పి.రజిని, కృష్ణకుమారి, కవిత, అనురాధ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## సిపిఐ(యం)పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి



**చింతకాని, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఈరోజు మధిర బోడేపూడి భవనం లో సిపిఐ (యం) పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం తెలబ్రోలు రాధాకృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు.ఈ సభలో సిపిఐ (యం) పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు , పలువురు ఏచూరి యొక్క గొప్పతనాన్ని, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలోమధిర టౌన్ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, సానుభూతిపరులు తదితరులు హాజరయ్యారు.

## రైతన్నల ఉసురు కాంగ్రెస్ కు తప్పదు

**యూరియా కొరత రైతులపై దాడి చేసినట్టే**

**రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం**

**అన్ని వర్గాల ప్రజల ఛీత్కారాలు మూటగట్టుకుంటున్న ప్రజా ప్రభుత్వం**

**బిఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ లావుడ్యా పూర్ణ**



**లక్ష్మీదేవిపల్లి, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రైతులకు దిగుబడి పెంచే యూరియా ఎరువు అందక, పంటకాలంలోనే రైతులు క్యూల్లో నిలబడే పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ లావుడ్యా పూర్ణ తీవ్రంగా విమర్శించారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న సమస్యలపై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ.. రైతు భుజాలపై భారమయ్యే సమస్యలను కాంగ్రెస్ పట్టించుకోవడం లేదన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడ్డ చరిత్ర లేదని, రైతన్నల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పదన్నారు. చెరువులు నిండినా, రైతుల గోదాములు మాత్రం ఖాళీగా ఉన్నాయని, పంటల కాలంలో ఎరువులు అందకపోవడం రైతు జీవితాన్ని అగాధంలోకి నెట్టే పరిస్థితి నెలకొందన్నారు. యూరియా సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. మాటలతో మోసం తప్ప రైతులకు ఉపయోగపడే పని లేదన్నారు. కాంగ్రెస్ నేతలు కేవలం పేపర్ స్టేట్మెంట్లతో మోసం చేస్తున్నారని, వాస్తవానికి రైతు కోసం ఏ ఒక్క పనీ చేయడం లేదని విమర్శించారు. బీద రైతు కష్టాలను ఎగతాళి చేసే ఈ పాలన కొనసాగితే రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని విమర్శించారు. రైతు కోసం నిరంతరం కృషి చేసే పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని, రైతును కాపాడడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. యూరియా కొరత కారణంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ఒక్క రైతులే కాకుండా అటు మహిళలు, ఇటు నిరుద్యోగులు, యువత వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోందన్నారు.

## జర్నలిస్టులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

**అక్రమ కేసు ఉపసంహరించుకోకపోతే ఆందోళనలకు పిలుపునిస్తాం.**

**టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు కు వినతి**



**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం లోని పిఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కొరతతో రైతులు పడే కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వీడియో కవరేజ్ లో ఉన్న టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు ఉమ్మడి ఖమ్మం జిల్లాల "టి న్యూస్ ఛానెల్" ప్రతినిధి వెన్నబోయిన సాంబశివరావుపై అదేవిధంగా వీడియో జర్నలిస్టు,4జి కిట్ టెక్నీషియన్ లపై కొనిజర్ల మండల పోలీసులు పెట్టిన అక్రమ కేసులను పున పరిశీలించి తక్షణమే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ శుక్రవారం టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిల ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులపై న అకారణంగా పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని అడిషనల్ డిసిపిని కోరారు. లేదంటే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనల కు పిలుపునిచ్చేందుకు కార్యాచరణ చేస్తామని అన్నారు. ప్రభుత్వానికి,ప్రజలకు వారధిగా నిలిచే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. కేసులు పెట్టి జర్నలిస్టుల స్వేచ్ఛను హరించడమేనని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి ,శెట్టి రజినీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ ఉదయ్, హరీష్ వనం నాగయ్య చక్రవర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి గుద్దేటి రమేష్ కార్యదర్శి , రాంబాబు , జిల్లా నాయకులు ఆతోటి శ్రీనివాస్ కోటేశ్వరరావు, తిరుపతి శ్రీనివాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా తప్పుడు వార్తలు నమ్మకండి

**అసత్య కథనాలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు**

**విలేకరుల సమావేశంలో సాయిరాం హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్**




**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** "ఠాగూర్ సీన్ రిపీట్ – మృతదేహానికి చికిత్స" అంటూ సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు వార్తలను నమ్మవద్దని, అటువంటి తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఖమ్మంలోని సాయిరాం ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్ అన్నారు. ఐఎంఏ నాయకులతో కలిసి ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జంగాల సునీల్ కుమార్ మాట్లాడుతూ... సాయిరాం హాస్పిటల్ పై కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచురించి ప్రజల్లో అభద్రతాభావాన్ని కలిగించే విధంగా చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. 13 సంవత్సరాల బాలుడు కామెర్లు, తీవ్రమైన లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాటు వైద్యం తీసుకుంటూనే హైదరాబాద్ స్థాయిలో అనేక ఆసుపత్రులు చుట్టూ తిప్పారని, కొన్ని రోజులపాటు ఓ దేవాలయంలో ఉంచారని పేషంట్ కండిషన్ తీవ్రతరం కావడంతో తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఆ సమయంలో ఐసీయూలో ఉన్న పేషెంట్ బ్రతికే ఉండి కాళ్లు చేతులు ఆడించటం పేషంటు బంధువులు చూశారని తెలిపారు. దానికి సంబంధించిన వీడియోలు కూడా బంధువులకు చూపించామని రోగి తీవ్రవిషమ పరిస్థితిలో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని రిఫర్ చేశామని తెలిపారు. పేషెంట్ ను తీసుకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యమంలో చనిపోయాడని తెలిపారు. తమ ఆసుపత్రి పై తప్పుడు ప్రచారం చేసేందుకు "ఠాగూర్ సినిమా రిపీట్ – మృతదేహానికి చికిత్స" అంటూ సోషల్ మీడియా గా అసత్య ప్రచారం చేశారని, తప్పుడు వార్తలు రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐఎంఏ నాయకులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ...డాక్టర్లు తమ వృత్తి ధర్మంలో భాగంగా పేషంటును బతికించడానికి ప్రయత్నం చేస్తారే తప్ప ప్రాణాలు తీయడానికి కాదని అన్నారు. పేషంటు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బాధితులకు ముందే చెప్పడం జరిగిందని, జరిగిన పరిణామంపై డాక్టర్లను దోషులుగా చిత్రీకరించాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా, వివరణ తీసుకోకుండా ఆసుపత్రులు, డాక్టర్లపై తప్పుడు వార్తలు రాసి బదనాం చేయాలనుకోవడం అవివేకం అని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ జంగాల స్వాతి, డాక్టర్ విజస్ వర్మ, డాక్టర్ సుజేంద్ర రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# 17న ఖమ్మానికి సీపీఐ(ఎం) నేత ఎంఏ బేబి

**'తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల' ముగింపు సభకు హాజరు**
**భక్తరామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు**
**చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ**
**ముస్లిం-హిందూ పోరాటంగా చిత్రీకరణ**
**విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 17వ తేదీన నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభకు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హాజరవుతున్నట్లు ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందన్నారు. ముస్లిం- హిందూ పోరాటంగా చిత్రీకరిస్తోందని చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, వై.విక్రమ్‌తో కలిసి నున్నా మాట్లాడారు. ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బేబితో పాటు కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. సభకు అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, రెడ్‌షర్ట్ వాలంటీర్లు హాజరవుతారన్నారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతి రోజున ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నైజాం ప్రభుత్వం కూలిపోయి భారతదేశంలో విలీనమైన 17వ తేదీతో ముగుస్తాయన్నారు. ఆ రోజున నిర్వహించే ముగింపు సభకు ఎంఏ బేబీ హాజరవుతున్నట్లు తెలిపారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగి సుమారు 77 సంవత్సరాలైందన్నారు. ఎప్పుడూ లేని విధంగా బీజేపీ దీనిపై సభలు నిర్వహిస్తుందని తెలిపారు. బీజేపీ ఈ పోరాట చరిత్రను వక్రీకరిస్తోందని, హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ 'రజాకర్ల ఫైల్స్' వంటి చిత్రాలను రూపొందించి తప్పుడు సంకేతాలు ఇస్తోందన్నారు. దీనిని సీపీఐ(ఎం), వామపక్షాలు ఖండిస్తున్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జమీందారి, జాగీర్దారి, దేశ్‌ముఖ్‌ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి, వెట్టిచాకిరీ రద్దు చేయాలని, పన్నులు వేసి ప్రజలను పీడిరచే విధానం పోయి ప్రజాస్వామ్యం కావాలని కోరుతూ కమ్యూనిస్టుల నాయకత్వంలో 'ఆంధ్రమహాసభ' ఆవిర్భవించిందన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం..దొడ్డి కొమరయ్య అమరత్వం తర్వాత సాయుధ పోరాట రూపం తీసుకుందని, దీనికి పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వం వహించారని వివరించారు. తెలంగాణ ప్రాంతంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దుం మొహినొద్దీన్, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఓంకార్, అరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, ఖమ్మం జిల్లాలో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, వట్టికొండ నాగేశ్వరరావు అనేక మంది యోధులు ఈ పోరాటంలో పాల్గన్నారని తెలిపారు. ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, నాలుగువేల గ్రామాల్లో వెట్టిచాకిరీ రద్దయిందని తెలిపారు. జమీందారు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లను తరిమి ప్రజాపాలన వచ్చిందన్నారు. ఈ పోరాట ఫలితంగానే భారతదేశంలో తెలంగాణ ప్రాంతం విలీనమైందని తెలిపారు. కొందరు దీనిని వక్రీకరించి పటేల్ సైన్యాలు రావటంతోనే నైజాం ప్రభువును లంగదీసుకున్నట్టుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. దీనికి ఏడాదిముందు నెహ్రూ ప్రభుత్వం నిజాం ప్రభువుతో పరస్పర సహకార ఒప్పందం చేసుకుందన్నారు. ఇది జరిగిన ఆరునెలల తర్వాత కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాట ఫలితంగా నైజాం పాలన అంతిమ దశకు చేరుకుందన్నారు. ఈక్రమంలో 1948 సెప్టెంబర్ 13న పటేల్ సైన్యాలు వస్తే 17న నైజాం రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేసినట్లుగా ప్రకటన చేశారన్నారు. నైజాం ప్రభువును రాజప్రముఖ్ (గవర్నర్) గా ప్రకటించి, రజాకార్లు చేసిన అనేక అకృత్యాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజలు సాధించుకున్న పోరాటానికి చట్టబద్ధత కావాలని 1951 వరకు పోరాటం కొసాగిందన్నారు. ఈ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. 50వేల మంది ప్రజలు చిత్రహింసలకు గురయ్యారన్నారు. లక్షల మంది జైళ్ల పాలయ్యారని, అనేక హత్యలు, అత్యాచారాలు, సామూహిక హత్యాకాండలు జరిగాయని వివరించారు. ఈ పోరాటంలో ఏ ఒక్కచోట బీజేపీ ప్రమేయం లేదన్నారు.

హిందూ ముస్లిం కాదు.. వర్గపోరాటం

ఫ్యూడలిజం, రాచరిక వ్యవస్థ, భూస్వామ్య దోపిడీపై తిరుగుబాటు చేసిన వర్గపోరాటం ఇదన్నారు. ఈ పోరాటంలో హిందువులే కాదు ముస్లింలు సైతం పాల్గన్నారని ముగ్దుంమొహినొద్దీన్, షోయబుల్లాఖాన్, బందగీ వంటి అనేక మంది ముస్లింలు ఈ పోరాటంలో అసువులు బాసారని తెలిపారు. అటువంటి చారిత్రక పోరాటానికి బీజేపీ మతం రంగు పులమడం అత్యంత దుర్మార్గమన్నారు. నిజాం పాలనలోనూ హిందూముస్లింలు కలిసిమెలిసి ఉన్నారని తెలిపారు. భారతదేశాన్ని లౌకికరాజ్యంగా ప్రకటించుకున్నామని, బీజేపీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే ఈ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశంలో భూసంస్కరణలు, కౌలుదారీ వంటి అనేక చట్టాలు వచ్చాయంటే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే కారణమన్నారు. దీని ఫలితంగానే నెహ్రూ ప్రభుత్వం భూసంస్కరణలు అమలు చేసిందన్నారు. అంతటి మహత్తర పోరాటాన్ని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తుండటాన్ని ఖండిరచారు. 17న నిర్వహించే సభ ద్వారా ఈ విషయాలన్నింటినీ మరోసారి ప్రజలముందుంచుతామని తెలిపారు.

## ముదిగొండ తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన ఎమ్మార్పీఎస్



**ముదిగొండ, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ముదిగొండ మండలం గంగాపురం, చింతకాని మండలం చిన్నమండవ శివారు ప్రాంతంలో పట్టా భూమి లో ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతి లేకుండా పట్టా భూములలో అక్రమంగా ఇసుక త్రవ్వకాలు జరుగుతున్న వారిపై అక్రమ వసూలు చేస్తున్న పట్టా పాస్ బుక్ వ్యక్తులపై మరియు ప్రభుత్వానికి చెందిన మున్నేరు పారివాహ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న పట్టా దారులపై చర్యలు తీసుకోవాలని ముదిగొండ చింతకాని మండల ఎమ్మార్పీఎస్ కమిటి ముదిగొండ తాసిల్దార్ సునీత ఎలిశబెత్ కి వినతి పత్రం అందజేశారు చేశారు.... ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కూపన్ లు 200 రూపాయలకి మంజూరు చేస్తుంటే ఇదే అదునుగా భావించి ఒక్కొక్క ట్రాక్టర్ కి 1000 వసూలు చేస్తున్నారు , ఇలా ప్రతిరోజు మూడు లక్షల ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నరు, అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సీన్ రేజి చార్జిలు వసూలు చేయడం వలన అధిక భారం పేదవాళ్లకి భారం పడుతుంది.. ఈ ఇసుక అక్రమ వసూలు ఆపాలని, పంట పొలానికి కాకుండా మున్నేరులో ఇచ్చినటువంటి పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ డిమాండ్ చేసింది.. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొలికపొంగు వెంకటరావు, గూడూరు వీరాస్వామి, వీరభద్రం, చింతకాని మండల అధ్యక్షులు చిర్ర ఉపేందర్, గుండ్ల రాంబాబు, పగిడిపల్లి రవీంద్ర బాబు,జొన్నలగడ్డ పుల్లరావు మరియు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఘన నివాళి



**ఖమ్మం టౌన్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఎస్ఎఫ్ఐ పూర్వ అఖిలభారత అధ్యక్షులు కామ్రేడ్ సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని ఊరు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మంచి కంటి భవన్ లో జరిగిన మొదటి వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ఎలమంచిలి రవీంద్రనాథ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక నాయకులు ఎం. సుబ్బారావు కే దేవేంద్ర, పాల్గొన్నారు. ఈ వర్ధంతి సభ కు బాలాజీ సింగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎ ఖయ్యూం, పాపయ్య, కళ్యాణం వెంకటేశ్వర రావు బుయ్య రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## సాంబశివరావు పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

**టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) భద్రాద్రి జిల్లా కమిటీ డిమాండ్**

**కొత్తగూడెం, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై కొనిజర్ల మండల కేంద్రంలో వార్త కవరేజ్ చేస్తున్న టీ న్యూస్ ఉమ్మ డి జిల్లాల బ్యూరో సాంబశివరావుపై గురువారం ఖమ్మం జిల్లా పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీజేఎఫ్) భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం టియుడబ్ల్యూజే (టిజెఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కల్లోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షఫీ, టెంజూ జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజానికి నాలుగో స్తంభంగా భాసిల్లుతున్న మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించేలా రైతుల సమస్యలను తెలుసుకుంటున్న విలేకరిపై పోలీసుల అనుచిత ప్రవర్తన అత్యంత జుగుప్సాకరమని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు సాంబశివరావు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులను సమీకరించి ఆందోళన చేప డతామని హెచ్చరించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో టియూడబ్ల్యూజే (టిజెఎఫ్) అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, కార్యదర్శి ఎండి షఫీ, టెంజూ అధ్యక్షులు వట్టికొండ రవి, కార్యదర్శి రాపర్తి శ్రీహరి, జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, గుర్రం రాజేష్, జిల్లా కార్యవర్గం ఉన్నారు.

## ఏ.ఎస్.జె ఆధ్వర్యంలో అన్నదానం..



**కొత్తగూడెం, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో అహలే సున్నత్వల్ జామాత్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఏ.యస్.జే. చైర్మన్ యం.ఏ.రజాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పిసిసి జనరల్ సెక్రటరీ మెతుకూరి ధర్మారావు, పిసిసి సభ్యులు జెబి.శౌరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ.. సర్వ మానవాళికి శాంతి సందేశం అందించిన మహమ్మద్ ప్రవక్త బాటలో అందరు నడిచి ప్రపంచ శాంతి వర్ధిల్లాలేలా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అహలే సున్నత్వల్ జామాత్ కమిటీ ఛైర్మన్ యంఏ. రజాక్, జిల్లా అధ్యక్షులు షేక్ కరీం ఖాద్రీ, ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్ మోహినుద్దీన్, షేక్ యఖుబ్ ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హుస్సేన్ ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ షమీ, అధికార ప్రతినిధి అడ్వకేట్ మహమ్మద్ సాదిక్ పాషా, సెక్రటరీ జనరల్స్ మహబూబ్ ఖాద్రీ, అలీం ఉద్దీన్, రైల్వే ఇస్మాయిల్, జిల్లా కమిటీ సభ్యులు మదీన అక్తర్, షేక్ నయీమ్ ఛీస్తీ, అస్లాం, ఏ.డ్యు.యస్. అధ్యక్షుడు అమీర్ ఖాద్రీ, కాంగ్రెస్, సిపిఐ, బిఆర్ఎస్ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై కేసు నమోదు సరికాదు

**తక్షణం ఉపసంహరించుకోవాలి-యుడబ్ల్యూజె (ఐజెయు)**

**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** జర్నలిస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదని తక్షణం కేసును ఉపసంహరించుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కొణిజర్ల పోలీసులు టి న్యూస్ జిల్లా రిపోర్టర్ సాంబశివరావు, వీడియో -జర్నలిస్టు నాగరాజు లతో పాటు మరో జర్నలిస్టుపై కేసు నమోదు చేయడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా -అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు ఒక ప్రకటన విడుదల చేశారు. మారిన పరిస్థితుల్లో యాజమాన్యాలు కోరినవిధంగా జర్నలిస్టులు పనిచేయాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేయడం, ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు కోరారు.

## జర్నలిస్టుపై కేసులు రద్దు చేయాలి



**ఖమ్మం టౌన్, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించిన టీ న్యూస్ ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. రైతుల సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చిన జర్నలిస్టుపై ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. గడచిన రెండు నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, తమ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం శోచనీయం. ప్రజల గొంతును నొక్కేందుకు పోలీసులను వాడుకోవడం పూర్తిగా అప్రజాస్వామికం. జర్నలిస్టు సాంబశివరావు పై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం.

## ఐఖ్యంగా ముందుకెళ్లండి విజయం

**మీవెంటే కలెక్టర్ అనుదీప్**



**ఖమ్మం బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాజీవ్ స్వగృహ కి సంబంధించి ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీ బిడ్ లో గెలిచిన సందర్భంగా శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ని ఉద్యోగ సంఘాల నాయకులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ దక్కించుకోవడానికి ఉద్యోగ సంఘాలు చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక ఒరవడి కలిగిన ఖమ్మం జిల్లా ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగుతూ టెండర్ ను దక్కించుకొని విజయాన్ని అందుకున్న మీరు ఈ ప్రాజెక్టును విజయవంతం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శవంతంగా నిలవాలని కోరారు. ఫ్లాట్స్ అందరూ వినియోగించే విధంగా వారికి దాని యొక్క ప్రాధాన్యతను వివరించినందుకు ముఖ్యంగా ఫ్లాట్స్ కి సంబంధించిన విధి విధానాలు తెలియజేసినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టిఎన్జీఓస్ అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు,కార్యదర్శి కొనిదెన శ్రీనివాసరావు, టిజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, విజయ్,రాంబాబు టిఎన్జీఓస్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్ ,వెంకన్న, దుర్గా ప్రసాద్, హరికృష్ణ కోణార్, ప్రభాకరా చారి రుక్మారావు,రమేష్, దిలీప్,సాయి, ఆస్లామ్, శంకర్,మంగ పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి యూనిఫార్మ్ బహూకరణ.

**మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కిలారుజగన్మోహనరావు**



**చింతకాని, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** చింతకాని మండల కేంద్రంలోని మాజీ నీటి సంఘం అధ్యక్షులు కిలారు జగన్మోహనరావు మండల కేంద్రంలోని పంచాయతీ సిబ్బందికి యునిఫార్మ్ బహూకరించి మాట్లాడారు.గ్రామాలలో పంచాయతీ సిబ్బంది చాలా కీలకంగా ఉంటారు అని,విధుల్లో పారిశుధ్యం ఎప్పటి కప్పుడు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటారు అని ప్రజలు కూడా వర్ష కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అని,వ్యాధుల పట్ల ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించాలని సిబ్బంది కి సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టాలను బయటపెట్టడమే నేరమా?

**- మాజీ ఎంపీ నామ**



**హైదరాబాద్ బ్యూరో, 12 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రైతుల కష్టాలను బయటపెట్టడమే నేరమా? యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలను బయటపెట్టినందుకు ఖమ్మం జిల్లా టీ-న్యూస్ జర్నలిస్టు సాంబశివరావుపై పెట్టిన కేసులను ఖండిస్తున్నానని బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల యూరియా కోసం పడుతున్న సమస్యలను ప్రస్తావించినందుకు జర్నలిస్టును వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. మీడియా స్వేచ్ఛను అణచివేయడం సరికాదని, రైతుల సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలి కానీ జర్నలిస్టుల పైన కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే జర్నలిస్టు సాంబశివరావుపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని నామ డిమాండ్ చేశారు.